క్లుప్తంగా

విద్యార్థి నిజాయితీ



సాయికుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయుడు

కడియం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి సాయికుమార్ తనకు దొరికిన రూ.20 వేల విలువైన బంగారు లాకెట్‌ను స్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణకు అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. ఇదే స్కూల్‌లో చదువుతున్న లోవరాజు గ్రౌండ్‌లో ఆడుకునే సందర్భంలో ఆ లాకెట్‌ను పోగొట్టుకున్నాడు. గ్రౌండ్‌లో దొరికిన లాకెట్‌ను సాయికుమార్ హెచ్‌ఎంకు అందజేయగా, దానిని లోవరాజు కుటుంబ సభ్యులకు ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్‌ను అభినందించి హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ రూ.ఐదు వందలను నగదు బహుమతిగా ఇచ్చారు.

పూర్తి నివేదిక అందజేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించి నివేదిక అందజేయాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వద్ద వారి పరిధిలోని పాఠశాలల సమగ్ర సమాచారం అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలన, సమ్మేటివ్–1 సిలబస్ పూర్తి తదితర సమాచారం ప్రొఫార్మా ప్రకారం అందించాలన్నారు. సమావేశంలో అర్బన్‌లోని ఎనిమిది స్కూల్ కాంప్లెక్స్‌ల చైర్మన్లు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు: స్థానిక సీతంపేటలోని రామ సత్యశ్రీ హోటల్‌పై బుధవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. అక్కడ గృహావసరాలకు వినియోగించే సిలిండర్లను వ్యాపార కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు ఇన్‌చార్జ్ రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు గుర్తించారు. ఆ ఐదు సిలిండర్లను స్వాధీనం చేసుకుని రెస్టారెంట్ యజమాని ఆబోతుల త్రినాథరావుపై కేసు నమోదు చేశారు. సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సురేష్‌బాబు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో కార్యాలయ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు వీరబాబు, వలీ, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో వ్యక్తికి జైలు

కడియం: పేపరుమిల్లు ఉద్యోగిపై కత్తితో దాడి చేసి, మోటారు సైకిల్‌ను తీసుకుపోయిన ఘటనలో ఓ వ్యక్తికి బుధవారం ఏడాది జైలు, జరిమానా విధిస్తూ ఒకటో అదనపు సెషన్స్ జడ్జి షేక్ జానీబాషా తీర్పు చెప్పారు. ఈ వివరాలను కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపారు. ఈ ఏడాది జనవరి 4న కడియం గ్రామానికి చెందిన కసిరెడ్డి శివ పేపరు మిల్లులో ఉద్యోగానికి వెళ్తూ రైల్వే గేటు సమీపంలో తన మోటారు సైకిల్‌ను ఆపాడు. ఇంతలో మధ్యప్రదేశ్‌లోని సాగర్‌జిల్లా పరసోడియం గ్రామానికి చెందిన రావియహర్వాల్ వచ్చి కత్తితో శివ మెడపై నరికి, అతడి మోటారు సైకిల్‌ను తీసుకుని పరారయ్యాడు. గాయపడిన శివను సహోద్యోగులు రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటి ఎస్‌ఐ ఆంజనేయులు కేసు నమోదు చేశారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ తిలక్ కేసు దర్యాప్తును ముమ్మరం చేసి చార్జిషీట్ ఫైల్ చేశారు. విచారణ అనంతరం ముద్దాయి యహర్వాల్ నేరం రుజువైంది. దీంతో బుధవారం పైవిధంగా తీర్పు వెల్లడించారు.

మద్యం విక్రేత అరెస్ట్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం జాంపేట ప్రాంతంలో మద్యం విక్రయిస్తున్న అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గుత్తి వీరభద్రరావును బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఈబీ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతని నుంచి 180 ఎంఎల్‌ల 16 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక ర్యాంపు పరిశీలన

కడియం: వేమగిరి– బుర్రిలంక ఇసుక ర్యాంపును రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి బుధవారం పరిశీలించారు. బిల్లులు సక్రమంగా లేవని ఆరోపించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమస్తు

- పేదలకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఓ వరం
- మండలంలో 14,723 మందికి వైద్య సేవలు



కడియం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యురాలు (ఫైల్)

కడియం: ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి సంక్షేమ వసంతం తీసుకొచ్చారు.. ప్రతి ఇంటికీ పథకాలు అందిస్తూ చరిత్రనే తిరగరాస్తున్నారు.. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకానికి ఏ మాత్రం లోటు రానీయకుండా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికే 98 శాతం నెరవేర్చారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికే ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేస్తున్నారు. మరో అడుగు ముందుకు వేసి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట రూపొందించిన కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలకు సైతం స్పెషలిస్టు వైద్య సేవలను చేరువ చేసింది. ప్రభుత్వం సురక్ష వైద్య శిబిరాల నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. ముందుగా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, వైద్య సిబ్బంది సర్వే చేశారు. ఆయా ప్రజలకు ఏ విభాగానికి చెందిన వైద్య నిపుణులు అవసరమో గుర్తించారు. అందుకు అనుగుణంగా సంబంధిత రంగంలో నిపుణులైన వైద్యులను సురక్ష వైద్య శిబిరాల వద్ద అందుబాటులో ఉంచారు. అలాగే ఈ శిబిరాల పట్ల ప్రజలకు ముందుగానే అవగాహన కల్పించి వారు వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు. కడియం మండలం కడియం, కడియపులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణలో శిబిరాల ద్వారా 14,723 మందికి వైద్య సేవలు అందించారు. మొత్తం 27 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు నెల రోజుల పాటు నిరాటంకంగా శిబిరాలు నిర్వహించారు. 356 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందించేందుకు గుర్తించారు. అలాగే 2,747 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 131 మందికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని తేల్చారు. శిబిరాల వద్దే 300 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఇంకా అవసరమని గుర్తించిన వారికి కూడా వాటిని అందజేసేందుకు చర్యలు చేపట్టారు. కళ్లజోళ్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికే చేర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

థైరాయిడ్ గుర్తించారు..

మా గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ పరీక్షల ద్వారా థైరాయిడ్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. సర్జరీ అవసరమన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ మొదటి దశ వైద్య పరీక్షలు చేశారు. రెండో దశ పరీక్షల నిమిత్తం కాకినాడ ఆసుపత్రికి రమ్మన్నారు. పరీక్షల అనంతరం సర్జరీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

– పి.రామలక్ష్మి, బుర్రిలంక

ఊళ్లోనే వైద్య శిబిరం

సురక్ష శిబిరంలో వైద్యులు పరీక్షించి గర్భసంచి శస్త్రచికిత్స పడుతుందన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో తొలి దశ వైద్య పరీక్షలు చేశారు. త్వరలోనే ఆపరేషన్ చేస్తామని తేదీ ఖరారు చేశారు. ఊళ్లోనే వైద్య శిబిరం ఏర్పాటుతోనే పరీక్ష చేయించుకోగలిగాను.

– పెదవేగి గౌరీ, కడియపులంక

'చందన' ట్రస్ట్ సేవలు

వైద్య శిబిరాలకు వచ్చే రోగులకు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ తన వంతు సేవలు అందించారు. తమ చందన చేయూత ట్రస్టు ద్వారా సచివాలయాల పరిధిలోని ప్రతి వైద్య శిబిరం వద్ద భోజన ఏర్పాట్లు చేశారు. రోగులకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు అందే విధంగా ఆయా గ్రామాల్లోని నాయకుల పర్యవేక్షణలో సేవలందించారు.

లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాపిరాజు



పుప్పాల బాపిరాజు

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ పుప్పాల బాపిరాజు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ఈ వివరాలను బుధవారం ఆయన తెలిపారు. కోవిడ్ సమయంలో సమాజానికి తన చిత్రాల ద్వారా అందించిన సందేశాలు, సామాజిక బాధ్యతగా చేసిన చిత్ర సేవకు ఈ రికార్డ్ నమోదైనట్టు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా విభాగపు చైర్మన్ డాక్టర్ అవినాష్ డి సకుండే తమ సందేశంలో పేర్కొన్నారన్నారు. బాపిరాజును జిల్లా విద్యా శాఖాధికారి ఎస్.అబ్రహం, డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎస్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, అర్బన్ ఎంఈఓ–2 రమారజని, ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎంవీఎమ్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

యోగా పోటీలకు ఎంపిక

ప్రకాశంనగర్: ఇటీవల తణుకులో జరిగిన నన్నయ విశ్వవిద్యాలయ పరిధి, ఇంటర్ కాలేజీల యోగా టీం సెలక్షన్ అండ్ టోర్నమెంట్‌లో తమ కళాశాల విద్యార్థులు తాడేపల్లి సూర్య, జి.శంకరస్వామి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల ప్రిన్సిపాల్ రాజబాబు బుధవారం తెలిపారు. వచ్చే నెల చెన్నైలో అన్న యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత విశ్వవిద్యాలయాల జాతీయ యోగా పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

గిరిజన వీరులకు ప్రాధాన్యం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ తదితరులు

సీటీఆర్ఐ: తెల్ల దొరలతో పోరాడిన తొలి గిరిజన వీరులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ అన్నారు. ఈ నెల 15న జాతీయ గౌరవ దివాస్ పేరుతో తెల్ల దొరలతో పోరాటం చేసిన బిర్సాముండా జయంతిని అన్ని ఐటీడీఏల పరిధిల్లో నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1875 నవంబర్ 15న బిర్సాముండా జార్ఖండ్ సమీపంలోని చోటనాగ్పూర్ వద్ద జన్మించారన్నారు. ఆయన పుట్టకముందే 1840 లోనే కారం తమ్మన్నదొర ఆంగ్లేయులపై తిరుగుబాటు లేవదీసి గెరిల్లా పోరాటం ద్వారా రంప వద్ద క్యాంప్‌లో ఉన్న 12 మంది సైనికులను హతమార్చి తెల్లదొరలకు సవాల్ విసిరారన్నారు. అయితే తొలి గిరిజన వీరులుగా, స్వాతంత్ర్య సమరయోధునిగా చరిత్రలో నిలిచిన కారం తమ్మన్నదొర, కారుకొండ సుబ్బారెడ్డిల చరిత్ర రాష్ట్ర కేంద్ర, ప్రభుత్వాలకు తెలియజేయడంలో అధికారులు తగిన శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో చిన్నారావు, వీరభద్రారెడ్డి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



తాడితోటలో మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్‌లను విడుదల చేస్తున్న పాలిక శ్రీను తదితరులు



కడియపులంక సచివాలయం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న స్టాలిన్

- వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ గూడూరి
- వాడవాడలా 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే'



ధవళేశ్వరంలో బుక్‌లెట్‌లు పంపిణీ చేస్తున్న జేసీఎస్ కన్వీనర్ విష్ణుమూర్తి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అనేక పథకాలు అమలు చేస్తూ పేదల జీవితాలకు వెలుగులు తెచ్చిన సీఎం జగన్ సంక్షేమ సారథిలా నిలిచారని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక నాలుగో సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. 45వ డివిజన్ ఇందిరానగర్ 83వ సచివాలయం పరిధిలో సుమారు రూ.13.58 కోట్లు పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారని, అదే విధంగా రూ.2.65 కోట్లతో అభివృద్ధి జరుగుతుందన్నారు. 30, 33వ డివిజన్లలోని బెస్తవీధి 53వ సచివాలయం పరిధిలో రూ.17.46 కోట్లు వివిధ పథకాల కింద కేటాయించగా, సుమారు రూ.4.69 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. తుమ్మలావ 65వ సచివాలయం పరిధిలో సుమారు రూ.17.77 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమకాగా, రూ.నాలుగున్నర కోట్ల విలువైన పనులు చేస్తున్నారన్నారు. 7వ డివిజన్ గోరక్షణపేటలో సుమారు రూ.13.26 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయని, దాదాపు సుమారు రూ.1.17 కోట్ల విలువైన పనులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, పథకాలతో ప్రతి సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాయకులు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, వాసు, పెంకే సురేష్, బర్రే కొండబాబు, మానే దొరబాబు, కాటం రజనీకాంత్, కస్సే రాజేష్, గౌస్ మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

రాజమహేంద్రవరం రూరల్: అర్హులందరికీ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అన్నారు. స్థానిక తాడితోటలో 29వ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని రూరల్ డివిజన్‌ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసెట్టి ప్రసాద్‌బాబు (రాజమౌళి), సచివాలయ కన్వీనర్లతో కలసి ప్రారంభించారు. అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించి, మా నమ్మకం నువ్వే జగన్ బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 15వ డివిజన్ ఇన్‌చార్జి ముత్యాల వీరభద్రరావు, సచివాలయ కన్వీనర్లు బాలు, దుర్గారావు, చిందాడ చిన్నారావు, కన్నమాంబ, ఆలయ డైరెక్టర్ పెన్నాడ నాగమణి, అనురాధ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కడియం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరని మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. కడియపులంక సచివాలయం–1 వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను స్టాలిన్ ఎగురవేశారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పల్లెనిద్ర చేశారు. స్టాలిన్ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి బాటలో కొనసాగాలంటే చందన నాగేశ్వర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నోడల్ ఆఫీసర్ వైవీవీఎస్ఎస్ లక్ష్మి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, నాయకులు బోడపాటి సత్యనారాయణ, బోడపాటి మూర్తి, ఆలమూరి శ్రీను, ఊటుకూరి శైలజ, ఆరేటి వెంకట్రావు చీకట్ల మాచరయ్య పాల్గొన్నారు.

ధవళేశ్వరం: సీఎం జగన్ సారథ్యంలో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. స్థానిక సచివాలయం–1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్ణుమూర్తి, ఈవోపీఆర్డీ తాడి కృష్ణ, సచివాలయ కన్వీనర్లు సాధనాల చంద్రశేఖర్ (శివ), బర్రి సుబ్బారావు, మెండా రాజేష్ తదితరులతో కలసి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల డిజిటల్ బోర్డు ఆవిష్కరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేశారు. విష్ణుమూర్తి మాట్లాడుతూ సచివాలయం–1 పరిధిలో రూ.37.78 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేశారన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ సెంటర్ వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, నాయకులు ముత్యాల జాన్, మెండి రాంబాబు, సత్యం వెంకటరమణ, సుంకర రమణ, మద్దాల బాబి, వైవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులకే నేరుగా పథకాల లబ్ధి



పథకాల గురించి వివరిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ పథకాల లబ్ధిని మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే వేసి ప్రభుత్వం పారదర్శక పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక 37వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. లలితానగర్‌లో తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయం కేంద్రంగా అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు మద్దతిచ్చి మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సబ్బారపు సూరిబాబు, బాలాజీరెడ్డి, మజ్జి అప్పారావు, బర్రే కొండబాబు, నామన వాసు, దుంగ మంగాలక్ష్మి, సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు పొందాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో సినిమా థియేటర్ యాజమాన్యాలు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎటువంటి బకాయిలు లేవని ఏపీఎఫ్‌టీటీడీసీ నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో థియేటర్ యాజమాన్యాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తేజ్‌భరత్ మాట్లాడుతూ ప్రదర్శనలకు ఆమోద యోగ్యమైన సినిమాలకు ప్రభుత్వం అనుమతిస్తుందని, వాటిని మాత్రమే థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సినిమాలు ప్రదర్శించే థియేటర్లకు ఏపీఎఫ్‌టీటీడీసీకి ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించి, ఆ మేరకు బకాయిలు ఏమీ లేవని నిరభ్యంతర ధ్రువపత్రం పొందాలన్నారు. కొందరు ఆ మేరకు చెల్లింపులు చేసినా, ఎన్‌వోసీ పొందలేదని, వెంటనే దరఖాస్తు చేసుకుని ధ్రువ పత్రాలు అందజేయాలని కోరారు. సినిమా థియేటర్ యజమానులకు వార్షిక అద్దె చార్జీలు, స్థిరమైన అడ్మినిస్ట్రేటివ్ చార్జీల చెల్లింపుపై లైసెన్సింగ్ అథారిటీ నుంచి ''ఫారం–బి'' లైసెన్స్‌ను పునరుద్ధరించడానికి వీలుగా వారికి 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' జారీ చేయడానికి ప్రభుత్వం ఆ కార్పొరేషన్‌కు అధికారం ఇచ్చిందన్నారు. సూపరింటెండెంట్ లక్ష్మీరమణి, సినిమా థియేటర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎస్.కిశోర్‌కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ తరహా నేరాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని, టెక్నాలజీని వాడుకొని నేరగాళ్లు డబ్బులు దోచుకుంటున్నారన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర యాప్‌లు, లింకులు, ఈ మెయిల్స్‌తో హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. విద్యార్థులు, యువకులు అనవసర లింక్‌లను క్లిక్ చేయడం వల్ల ఎన్నో అనర్థాలు, నష్టాలు జరుగుతున్నాయన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్, చాటింగ్‌కు దూరంగా ఉండాలని, ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పవద్దన్నారు. తమ వ్యక్తిగత, బ్యాంక్ అకౌంట్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. అలాగే మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత కష్టాల పాలవుతోందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.

శెట్టిబలిజల ఐక్యతను చాటుతాం..



సమావేశంలో మాట్లాడుతున్న సానబోయిన రామారావు

సిటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శెట్టిబలిజల ఐక్యతను మరింత చాటేందుకు కృష్ణా, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కమిటీలు వేస్తామని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో అధికంగా సీట్లు కేటాయించే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ సంఘం సారథ్యంలో ఈ నెల 19న జరిగిన శెట్టిబలిజ కార్తిక వన భోజన మహోత్సవం విజయవంతం కావడంతో సంఘ నాయకులు, ఆహ్వాన కమిటీ సభ్యులు బుధవారం స్థానికంగా సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు మాట్లాడుతూ తమ సంఘీయుల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శెట్టిబలిజ కార్పొరేషన్‌కు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం బ్రాందీ షాపుల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రతి మండలం, పట్టణ కేంద్రాల్లో శెట్టిబలిజ కల్యాణ మండపాలు నిర్మించడానికి స్థలం, కొంత నిధులు ప్రభుత్వం ఇవ్వాలన్నారు. ఉపాధ్యక్షుడు అప్పారి జయప్రకాష్ మాట్లాడుతూ తమ సంఘీయులను రాజకీయ, విద్యా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిశెట్టి తాతబ్బాయి, కార్యదర్శి ఇళ్ల శివప్రసాద్, సభ్యులు మట్టపర్తి సత్యనారాయణ, కొప్పిశెట్టి రమేష్, కడలి వెంకట్రావు, ఆనెం చిన్న, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.